

మాక్ టెస్ట్‌లు రాస్తున్నా..

డిగ్రీ పూర్తి చేసి బ్యాంక్, ఎస్ఎస్‌సీ పరీక్షలకు సిద్ధం అవుతున్నా. బ్యాంకర్స్ అడ్డా యాప్ ద్వారా మాక్ టెస్ట్‌లు రాస్తున్నాను. బాగున్నాయి. బ్యాంక్ పరీక్షలకు ఆన్‌లైన్ ప్రాక్టీస్ ముఖ్యం. వేగవంతంగా కచ్చితత్వంతో అన్ని సెక్షన్లలో క్వాలిఫై అవ్వాల్సి ఉంటుంది.

– అరవింద్‌కుమార్ (మణి), మహారాణిపేట



మొబైల్‌లోనే టెస్ట్..

మొబైల్ యాప్‌లు నాలెడ్జి వనరులుగా ఉపయోగపడుతున్నా యి. యాప్స్ రూపకల్పన జరిగి ఏళ్లవుతున్నా వీటిని ఉపయోగించే వారు తక్కువగా ఉన్నారు. వీటి వల్ల సమయం ఆదా అవుతుంది. ఖర్చు కూడా ఉండదు. మొబైల్ యాప్స్‌లో మాక్ టెస్ట్‌లు తరచూ రాస్తున్నాను.

– సీహెచ్ అజయ్‌కుమార్, జగదాంబ



పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్నా..

పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ స్మార్ట్ ఫోన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని సిద్ధమవుతున్నా. రెండు.. మూడు నెలల్లో జరగబోయే డీఎస్సీ పరీక్షకు పెద్ద ఎత్తున కసరత్తు చేస్తున్నా. మెటీరియల్ ఎంతో ఉపయుక్తంగా ఉంది. పరీక్షలకు సులువుగా సిద్ధం అయ్యే అవకాశం కలుగుతుంది.

– ఎస్‌పి లక్ష్మి, ఆరిలోవ, పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న అభ్యర్థి

చదువుల సిరులు

అంతా మొబైల్ యాప్‌లోనే..

విద్యార్థులకు కల్పతరువుగా మారిన మొబైల్ లెర్నింగ్ యాప్స్

పోటీ పరీక్షల అభ్యర్థులకు తిరుగు లేని సాధనం

సివిల్స్, బ్యాంక్, కరెంట్ అఫైర్స్.. పరీక్ష ఏదైనా నో ఫియర్



పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే అభ్యర్థులు ఇది వరకు కోచింగ్ సెంటర్లకు పరుగులు తీసేవారు. శిక్షణ మాట అటుంచితే వెళ్లి రావడానికి చాలా సమయం పట్టేది. ఆ సమయం అంతా వృథా అయ్యేది. అంతే కాదు అభ్యర్థులు శారీరకంగా, మానసికంగా అలసిపోయేవారు. ఈ ప్రభావం ప్రిపరేషన్ మీద పడేది. సమయాభావం వల్ల పూర్తి స్థాయిలో దృష్టి సారించలేక అవకాశం కోల్పోయిన వారు చాలా మంది ఉన్నారు. అయితే ప్రస్తుతం పరిస్థితి మారుతోంది. స్మార్ట్ ఫోన్ లెర్నింగ్ వైపు అభ్యర్థులు అడుగులు వేస్తున్నారు. పలు సంస్థలు ఇచ్చే శిక్షణ, నమూనా పరీక్షల యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్‌లోనే పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. తమకు నచ్చిన సబ్జెక్టు నేర్చుకోవడంతో పాటు సమయం ఆదా చేసుకుంటున్నారు.

డాబాగార్డెన్స్: పోటీ పరీక్షలకు సిద్ధమయే అభ్యర్థులు మొబైల్ ఫోన్‌నే అధ్యయన సాధనంగా ఉపయోగిస్తున్నారు. తమకు కావల్సిన సమాచారాన్ని సేకరించుకోవడంతో పాటు ఆన్‌లైన్ శిక్షణ తరగతుల యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని చదువుకుంటున్నారు. రాను రాను పోటీ పరీక్షలకు మొబైల్ శిక్షణ యాప్‌లు కీలకంగా మారుతున్నాయి. బ్యాంకు పరీక్షలకు బ్యాంకర్స్ అడ్డా, కరెంట్ అఫైర్స్‌కి జార్గాన్‌జోష్, సివిల్ ఎగ్జామ్స్‌కి లాస్ ఎగ్జామ్స్, సివిల్ డైలీ యాప్స్, గ్రూప్స్‌కు పలు యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. దీంతో ఎక్కువ మంది ఆ యాప్‌లను ఆశ్రయించి శిక్షణ పొందుతున్నారు.

నిర్వాహక సంస్థల ఆసక్తి..

మొబైల్ యాప్స్ ద్వారా నైపుణ్యం అందించేందుకు పరీక్షల నిర్వాహక సంస్థలు సైతం ఆసక్తి చూపుతున్నాయి. ఉద్యోగాలతో పాటు క్యాట్, జీమ్యాట్, జేఈఈ వంటి వాటికి కూడా రివ్యూ పేరిట మొబైల్ యాప్‌ను విడుదల చేసి అందిస్తున్నారు. నమూనా పరీక్షలు రాసిన ఔత్సాహిక అభ్యర్థులు శ్లాబ్‌ల వారీగా పరీక్ష, శైలి, ప్రశ్నల క్లిష్టత స్థాయి గురించి తెలుసుకోవడంతో పాటు పోటీలో తమ పనితీరును కూడా అంచనా వేసుకోవచ్చు. ప్రతి పరీక్షకు ప్రత్యేకంగా వాటిని రూపొందించడం విద్యార్థులకు కలిసి వచ్చే అంశం. మొబైల్ యాప్స్‌లో ప్రత్యేకత ఏమిటంటే అప్లికేషన్లను ఇంటర్నెట్ ద్వారా డౌన్‌లోడు చేసుకుంటే ఆ తర్వాత ఇంటర్నెట్ అవసరం లేకుండానే దీర్ఘకాలం ఆ అప్లికేషన్‌లో పొందుపరిచిన సమాచారాన్ని చదువుకునే అవకాశం లభిస్తుంది.

ఈ మధ్య కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లు ఇస్తూ వస్తున్నాయి. రైల్వే, సీఆర్‌పీఎస్, బ్యాంకులు, గ్రూప్స్, డీఎస్సీ వంటి ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వెలువరిస్తున్నాయి. దానికి తగ్గట్టుగా అభ్యర్థులు పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. ఆన్‌లైన్‌లో పరీక్షలకు సిద్ధం అవడంతో పాటు నమూనా పరీక్షలు కూడా మొబైల్ యాప్‌లోనే రాస్తున్నారు. విశాఖలో సివిల్స్, గ్రూప్–1, గ్రూప్–2, పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు ప్రిపేరయ్యే అభ్యర్థులు ఎక్కువగా ఉన్నారు. వీరిలో చాలా మంది ఆన్‌లైన్‌లోనే మాక్ టెస్ట్‌లు రాస్తున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న మొత్తం అభ్యర్థుల్లో 70 శాతం మంది స్మార్ట్ ఫోన్లలో ఆన్‌లైన్ పరీక్షలు ప్రాక్టీస్ చేస్తున్నట్టు అంచనా. దీనిని బట్టి స్మార్ట్ ప్రిపరేషన్ ఎలా ఉంది అనేది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. విద్యా నిపుణులు కూడా ఆన్‌లైన్‌లోనే శిక్షణ ఇస్తూ అభ్యర్థులకు మెలకువలు బోధిస్తున్నారు. సందేహాలు తీరుస్తున్నారు. అభ్యర్థులు కూడా సందేహాలు ఉంటే ఆన్‌లైన్‌లోనే అడిగి తెలుసుకుంటున్నారు. ఇదంతా స్మార్ట్ ఫోన్ల ద్వారానే జరిగిపోతుంది. ప్రిపరేషన్, గైడెన్స్‌తో పాటు పాత ప్రశ్న పత్రాలను కూడా నిపుణులు విశ్లేషిస్తున్నారు. మోడల్ ప్రశ్నలతో పాటు ప్రాక్టీస్ కోసం సెక్షన్ల వారీగా ప్రశ్నలు రూపొందించి అభ్యర్థులకు అందిస్తున్నారు.



విశాఖ సెంట్రల్ లైబ్రరీలో పోటీ పరీక్షలకు చదువుతున్న అభ్యర్థులు

వైభవంగా రథసప్తమి





విశేష అలంకరణలో శ్రీ సూర్యనారాయణస్వామి, స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట అలివేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణస్వామి దేవాలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త యల్లపు హరికృష్ణ, యల్లపు హేమంత్ పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు పానంగిపల్లి కేశవాచార్యులు శ్రీ వైఖానస ఆగమ సాంప్రదాయం ప్రకారం ఉషా, ఛాయా, పద్మినీ సమేత శ్రీసూర్యనారాయణ స్వామికి తెల్లవారు జామున పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని మందార, గులాబీ, చామంతి వంటి పూలతో అలంకరించారు. స్వామివారికి బెల్లం, గోక్షీరంతో తయారు చేసిన పరమాన్నం నివేదన చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు అల్లిపురం పరిసర ప్రాంతాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు కేశవాచార్యులు మాట్లాడుతూ సూర్యనారాయణ స్వామిని ప్రార్థించడం వల్ల సమస్త రోగములు నశించి సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు.

శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో..

టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో గల సూర్యనారాయణమూర్తి దేవాలయంలో స్వామికి ఆలయ అర్చకుడు భార్గవశర్మ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

బెల్లం గణపతి ఆలయంలో..

రెల్లివీధి దరి బెల్లం గణపతి ఆలయంలో వెలిసిన సూర్యనారాయణమూర్తికి ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాల అనంతరం స్వామిని విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు ఆదిత్యుని దర్శించుకునేందుకు బారులు తీరారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో..

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో సూర్యభగవానునికి మంగళవారం ఆవుపాలతో పరమాన్నం చేసి నివేదించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు తిరుపతిరావు, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఏఈవో తిరుమలేశ్వరరావు తదితరులు

వైభవంగా షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో షిర్డీ సాయిబాబా



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

అల్లిపురం: జెండా చెట్టు వీధిలో వెలసిన శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ 27వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో తెల్లవారు జాము నుంచి బాబాకు పంచామృతాభిషేకాలు, విభూతి హారతి, విశేష అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో హోమం జరిపించారు. మధ్యాహ్నం బాబా సన్నిధిలో జరిగిన అన్న సమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం బాబా చావడి ఉత్సవం జెండా చెట్టు వీధి నుంచి లక్ష్మీదేవిపేట, అంబేడ్కర్ కాలనీ, భూపేష్‌నగర్ ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొమర శ్రీనివాసరావు, కదిరి గురుమూర్తి, కొమర సత్యనారాయణ, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు లింగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం



పేరుకుపోయిన చెత్త ఎత్తిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన భాద్యత వార్డు ఇన్‌స్పెక్టర్లదే అని జీవీఎంసీ జోన్–4 జెడ్సీ ఎం.మల్లయ్య నాయుడు అన్నారు. మంగళవారం ఆయన జోన్ పరిధిలోని 12 వార్డుల్లో పర్యటించారు. వీధులు శుభ్రంగా లేకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. స్వచ్ఛభారత్ కోసం నిరాంతరం శ్రమిస్తుంటే వార్డు ఈవిధంగా ఉంటే ఎలా అని ఇన్‌స్పెక్టర్లను ప్రశ్నించారు. వీధుల్లోని చెత్తను ఎప్పటికప్పుడు యార్డుకు తరలించాలని చెప్పారు. క్లాప్ వాహనాల కార్యకలాపాలను కార్యాలయానికి తెలియపరచాలన్నారు. అనంతరం 28వ వార్డులో పర్యటించి అక్కడి చెత్తను జేసీబీ ద్వారా ఎత్తించి ఆ పరిసరాలను పరిశుభ్రం చేయించారు. సెక్రటరీలు ఉదయాన్నే ఇన్‌స్పెక్టర్లతో కలిసి పారిశుధ్య పనులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెండు రోజుల జాతీయ సదస్సు



జాతీయ సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిథులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ కేంద్రీయ హిందీ సంస్థాన్, కళాశాల భాషా విభాగాల ఆధ్వర్యంలో 'తెలుగు జ్ఞానపీఠ పురస్కార గ్రహీతల సాహితీ కృషి'పై జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథులుగా ఆంధ్రా యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య టి.వి.కృష్ణ, విశిష్ట అతిథులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ ప్రొఫెసర్ ఆచార్య ఆర్ఎస్ సర్రాజు, నన్నయ విశ్వవిదాలయం తెలుగు ఆచార్యులు టి. సత్యనారాయణ మాట్లాడారు. సుమారు 80 మందికి ప్రమాణ పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, కో–ఆర్డినేటర్ ద్వితీయ భాషా విభాగాధ్యక్షులు డాక్టర్ పి.కె. జయలక్ష్మి, ఆచార్య గంగాధర్ వనోడే, ఆర్.సుమలత, ఆచార్య జ్యోతి, డాక్టర్ నిర్మల, డాక్టర్ ఎస్. దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ భాస్కర సుధ తదితరులు పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ అమ్మవారి ఉత్సవాలకు శ్రీకారం



జగదాంబ దరి ఎల్లమ్మ ఆలయానికి తరలి వెళ్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాలకు శుక్రవారం రథ సప్తమి సందర్భంగా శ్రీకారం చుట్టారు. మార్చి 5,6,7 తేదీల్లో అమ్మవారి 25వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించేందుకు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గౌరవాధ్యక్షుడు, ఫౌండర్ పీల వెంకటప్పలనాయుడు, ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, కార్యదర్శి బొడ్డు పోలారావు, పంపాన గణేష్, బడే నాగరాజు, దున్నబోయిన సత్యనారాయణ, పాకలపాటి అప్పారావు, ఎన్. సత్తిబాబు, కె. సత్తిబాబు, అచ్చియ్యమ్మపేట గ్రామ పెద్ద కుంచపు ఆదినారాయణ (మౌని) తదితరులు పాల్గొని అమ్మవారి ఉత్సవాలకు ముడుపు కట్టారు. ఆలయ అర్చకుడు కొడమంచిలి కామేశ్వరశర్మతో కలిసి జగదాంబ దరి యల్లమ్మ అమ్మవారి దేవాలయానికి వెళ్లి పసుపు, కుంకుమలు అందజేసి పండగ కోసం అనుమతి తీసుకున్నారు.

చందన మారుతి దర్శనం

మురళీనగర్: జాతీయ రహదారిని ఆనుకుని సూర్యానగర్‌లో వెలసిన యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయం 14వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామిని చందన మారుతిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామికి పూజలు చేశారు. వారికి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పెనుమత్స సుబ్బరాజు పాల్గొని పూజలు చేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి

సీతంపేట: శీతల్ స్వర్ సంగీత సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వి.వి.రమణమూర్తి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి సంగీత విభావరిని ప్రారంభించారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు పలు తెలుగు చిత్రాల్లోని పాటలు ఆలపించి అలరించారు. వ్యవస్థాపకురాలు బి. లక్ష్మి, కళా సంస్థల ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, ఎ.వెంకట్, పి. బాబ్జి, అంజనేయరెడ్డి, నర్సింగ్, ఎల్.వెంకటేష్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ శివానంద్, డాక్టర్ బుచ్చిరాజు తదితరులు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కేజీహెచ్ వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ర్యాలీని ప్రారంభించారు. సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ పిల్లల వార్డు మీదుగా సీఎస్ఆర్ కాంప్లెక్స్, గైనిక్ వార్డు వరకు కొనసాగి తిరిగి సూపరింటెండెంట్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ క్యాన్సర్ పట్ల అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప, రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి, సర్జికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ గురురాఘవేంద్ర నాయక్, ప్రివెంటివ్ అంకాలజీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.సాయి సుష్మ, ఇతర విభాగాల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ..

ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిర్వహించిన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ రేసవాని పాలెం వద్ద మొదలై సత్యం కూడలి మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. జిల్లా సమన్వయకర్త డాక్టర్ హారిక, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్, ఇతర అధికారులు, నర్సింగ్ విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల కళాశాలలో..

డాబాగార్డెన్స్: సౌత్ జైల్‌రోడ్డులో గల విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాలలో డాక్టర్ వైఎల్ నర్సింగరావు అధ్యక్షతన క్యాన్సర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ఐ. వాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్స్ వేయించుకోవాలని బాలికలకు తెలిపారు. కేజీహెచ్ ప్రసూతి విభాగం అధికారి సంధ్యాదేవి మాట్లాడుతూ క్యాన్సర్ గర్భాశయ ముఖ ద్వారం చెకింగ్ ద్వారా మాత్రమే తెలుసుకోగలమని, కేజీహెచ్‌లో ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. డాక్టర్ సామిని, డాక్టర్ జీవీ కిరణ్మయి, డాక్టర్ హారికతో కలిసి పలువురు వైద్యుల బృందం ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని సూచనలు చేశారు. ప్రతి నెలా అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ పరీక్షలు చేస్తున్నట్లు డాక్టర్ వైఎల్ నరసింగరావు తెలిపారు.

బోర్డు ఇలా.. రాకపోకలు ఎలా?



సబ్‌వే వద్ద ఉన్న నో ఎంట్రీ బోర్డు

సీతమ్మధార: ఆశీలమెట్ట జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న సబ్‌వే వద్ద నో ఎంట్రీ బోర్డుతో వాహన చోదకులు తికమక పడుతున్నారు. జీవీఎంసీ ఏర్పాటు చేసిన సబ్‌వే వద్ద మొదట్లో వన్‌వే ట్రాఫిక్ అమలులో ఉండటంతో, అప్పట్లో నో ఎంట్రీ బోర్డు ఏర్పాటు చేశారు. కాలక్రమంలో కొన్ని సంవత్సరాలుగా రెండు వైపులా రాకపోకలు అనుమతించడంతో వాహనాలు ప్రయాణిస్తున్నాయి. కాని, నగరానికి కొత్తగా వచ్చే వారు ఇక్కడ నో ఎంట్రీ బోర్డు చూసి కంగుతింటున్నారు. రామాటాకీస్ మీదుగా వస్తూ పాత జైలురోడ్డు జంక్షన్‌కు వెళ్లే వాహనాలు సబ్‌వే నోఎంట్రీ బోర్డు దిగువ భాగం మీదుగా వెళ్తుంటాయి. అలాగే, పాత జైలు రోడ్డు జంక్షన్ నుంచి సబ్‌వే మీదుగా రామాటాకీస్ రోడ్డు వైపు వాహనాలు వస్తుంటాయి. ఈ సబ్‌వే మార్గం సగం త్రీటౌన్, మిగిలిన సగభాగం ద్వారకా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోకి వస్తుంది. సబ్‌వేలో డివైడర్లు కూడా లేకపోవడంతో ట్రాఫిక్ గందరగోళంగా ఉండడం తెలిసిందే. ఈ బోర్డు కారణంగా తికమక పడుతున్న వాహనచోదకులకు ఉపశమనం కలిగేలా జీవీఎంసీ అధికారులు వెంటనే ఈ బోర్డు తొలగించాలని వాహనచోదకులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

కుటుంబం చెంతకు వృద్ధుడు



అప్పలస్వామిని కుమారుడికి అప్పగిస్తున్న మేనేజర్ జ్యోతిర్మయి

సీతమ్మధార: విజయనగరం జిల్లా భోగాపురానికి చెందిన పూసరెడ్డి అప్పలస్వామి (68) గత నెల 26న నగరంలోని ఆశీల్‌మెట్ట జంక్షన్‌లో భిక్షాటన చేస్తుండగా ఏయూటీడీ ప్రతినిధులు గమనించి షెల్టర్ హోంకు తరలించారు. అతని చిరునామా తెలుసుకుని మంగళవారం భోగాపురం దగ్గరలో గల పెదసుబ్బవానిపాలెం లోని కొడుకు అప్పారావుకి అప్పగించారు. ఇల్లు, పొలం ఉండడంతో పాటు పెన్షన్ కూడా వస్తున్న అప్పలస్వామి మద్యపానానికి అలవాటు పడి విశాఖలో భిక్షాటన చేస్తుంటాడని, అతని భార్య మరణించిందని ఏయూటీడీ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

24 గంటల్లో బాలిక ఆచూకీ లభ్యం

డాబాగార్డెన్స్: జాలారిపేటకు చెందిన 16 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. ఆమె తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. సీఐ జీడీ బాబు నేతృత్వంలో పోలీస్ సిబ్బంది 24 గంటల్లోనే ఆ బాలిక ఆచూకీ తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులకు బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మానసిక దివ్యాంగుడికి ఆపన్న హస్తం



బాలుడికి నూతన వస్త్రాలు తొడుగుతున్న మాసిపోగు రాజు

డాబాగార్డెన్స్: మానసిక వ్యాధికి గురై 36వ వార్డులో కాళ్లకు దెబ్బలు తగిలించుకుని.. రక్తం కారుతూ నడివీధిలో తిరుగుతున్న ఓ బాలుడిని చూసి ఆ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు మాసిపోగు రాజు చలించిపోయారు. పూర్తిగా బట్టలు లేని ఆ బాలుడికి నూతన వస్త్రాలు తొడిగారు. రక్తం కారుతున్న బాలుడి కాలికి తోచిన సాయం చేయించి.. అల్పాహారం పెట్టించి.. ప్రభుత్వ మానసిక ఆస్పత్రికి ఆటోలో తరలించారు.

ఘనంగా భ్రమరాంబ, మల్లికార్జునస్వామి పరస



పరసలో భక్తుల కోలాహలం

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు రామాటాకీస్ దరి శ్రీనగర్ కాలనీలో గల శ్రీ శివాలయంలో భ్రమరాంబ, మల్లికార్జున స్వామిల పరస మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఘనంగా పరస జరిగింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. శ్రీనగర్, రామాటాకీస్, ఆశీలమెట్ట, అశోక్‌నగర్, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పరసలో పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.